గుంటుకలకు భలే గిరాకీ



బండల్‌నాగాపూర్ శివారులో కాడెద్లతో కలుపుతీత పనులు చేస్తున్న రైతు

- కలుపుతీత పనుల్లో రైతులు బిజీబిజీ
- కాడెద్దులకు ఫుల్ డిమాండ్
- రోజుకు రూ.1500 సంపాదన

తాంసి: వ్యవసాయ పనులు చేసేందుకు ఎన్ని ఆధునిక యంత్రాలు వచ్చినా.. కొన్ని పనులకు మాత్రం కాడెద్దులు, గుంటుకల అవసరం తప్పడం లేదు. ప్రస్తుతం రైతులు సాగుచేసిన పత్తి, కంది, సోయా పంటలు కలుపు తీసే దశలో ఉన్నాయి. దీంతో రైతులు కాడెద్దుల ద్వారా గుంటుకలతో కలుపు మొక్కలు తొలగిస్తున్నారు.

యంత్రాలను ఉపయోగిస్తే పంట సైతం దెబ్బతినే అవకాశం ఉందని, కాడెద్ల ద్వారా పనులు చేపడుతున్నారు. గ్రామాల్లో కాడెద్దులు, గుంటుకలకు డిమాండ్ పెరిగింది. మళ్లీ వర్షాలు కురిస్తే కలుపు పెరిగే అవకాశం ఉందని, ఎలాగైనా పనులు ముగించుకోవాలని కాడెద్లు ఉన్న రైతులకు అడ్వాన్స్ చెల్లించి పనులు చేసుకుంటున్నారు.

ఊపందుకున్న పనులు..

మండలంలో రైతులు ఎక్కువగా పత్తి, కంది, సోయా, పెసర పంటలు సాగు చేశారు. గత వారం రోజుల క్రితం వరకు ఏకధాటిగా వర్షాలు కురవడంతో పంటచేల్లో పంటలతో పాటు ఏపుగా కలుపు మొక్కలు పెరిగాయి. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో చాలా మంది రైతులు పశుపోషణ మాని వ్యవసాయంలో ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. కానీ పత్తి, కంది, సోయాలో కలుపు తీసేందుకు కాడెద్దులనే వినియోగించాల్సి వస్తోంది. గ్రామాల్లో రైతులకు సరిపడా కాడెద్దులు లేకపోవడం ఇబ్బందిగా మారుతోంది. గుంటుక కొట్టేందుకు రోజుకు రూ.1500 వరకు తీసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో రోజుల తరబడి ఆగాల్సి వస్తోంది.

తగ్గిన పశుపోషణ..

గ్రామాల్లో పశుపోషణ తగ్గడంతో కాడెద్ల కొరత ఏర్పడింది. ఇటీవల కాలంలో పశుగ్రాసం కొరత, మేత లేకపోవడం చిన్న, సన్నకారు రైతులకు పశుపోషణ భారంగా మారింది. పశుపోషణ భారంగా మారడంతో వ్యవసాయంలో వినియోగించే కాడెద్దుల సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. దీంతో రైతులు యంత్రాలపై ఆధారపడి వ్యవసాయ పనులు చేస్తున్నారు. కానీ కలుపుతీత పనులకు కాడెద్లు అవసరం అధికంగా ఉంది.

రోజుకు రూ.1500 సంపాదిస్తున్నా



చేలలో కలుపు పెరిగింది. తప్పనిసరిగా గుంటుకతో పనులు చేయాల్సి ఉంటుంది. కాడెద్లు, గుంటుకలు ఉన్న రైతులకు ఇప్పుడు మంచి డిమాండ్ ఉంది. గుంటుక ద్వారా పని చేయడంతో సులువుగా పిచ్చిమొక్కలు తొలగిపోతాయి. కలుపుతీత పనులు చేస్తూ రోజుకు రూ.1500 సంపాదిస్తున్నా.

– అలాలి అశోక్, రైతు, తాంసి

వేచి ఉండాల్సి వస్తోంది



నాకున్న మూడు ఎకరాల్లో కాడెద్దులు లేకుండానే వ్యవసాయం చేస్తున్నాను. కలుపుతీత పనులు మాత్రం గుంటుకతో పని చేయాల్సి వస్తోంది. గుంటుకలకు డిమాండ్ పెరగడంతో రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

– నవకాంత్ రెడ్డి, రైతు, తాంసి

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

గుడిహత్నూర్: మండల కేంద్రంలో ఈనెల 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సేన రాష్ట్ర సహాయ కార్యదర్శి రాయిసిడం జంగు అన్నారు. మండలంలోని మాన్కాపూర్ రాయిసెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని సంస్కృతి సాంప్రదాయాలు కాపాడాలన్నారు. సమావేశంలో రాయిసెంటర్ సార్‌మేడి పెందూర్ జైరాం, ఆదివాసీ సేన నాయకులు తొడసం భూమాపటేల్, ఉయిక లక్ష్మణ్, సెడ్మకి భీం రావ్, కుమ్ర రాందాస్, తొడసం లక్ష్మణ్, ఆత్రం భీం రావ్ పాల్గొన్నారు.

నార్నూర్: ఇంద్రవెల్లి మండలంలోని కెస్లాపూర్‌లో ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, సర్పంచ్ సంఘం మండలాధ్యక్షుడు ఉర్వేత రుపదేవ్‌లు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని కుమురం భీం భవన్ వద్ద ఆదివాసీ సంఘాల నాయకులతో మాట్లాడారు. ఆదే కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి, బైక్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు ఈస్రు, తుడందెబ్బ జిల్లా నాయకులు మెస్రం మానిక్‌రావు, మాజీ ఎంపీపీ ఆత్రం మీరాబాయి, యాదవ్‌రావు, బాదిరావు పాల్గొన్నారు.

ప్రతీ గూడెంలో జెండా ఎగురవేయాలి



నినాదాలు చేస్తున్న ఆదివాసీ నాయకులు



జెండా పంపిణీ చేస్తున్న నాయకులు

ఇచ్చోడ: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రతీ గూడెంలో గోండ్వాన జెండాలు ఎగురవేయాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు ఆత్రం మహేందర్ కోరారు. సోమవారం మండలంలోని మేడిగూడలో జెండాలను పంపిణీ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొడప కోటేశ్వర్, సర్పంచ్ మాడవి భీంరావు, ఎంపీటీసీ మెస్రం దేవురావు పాల్గొన్నారు.

బోథ్: ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ నాయకులు కోరారు. గ్రామాల్లో జెండా ఎగురవేయాలన్నారు. అనంతరం కేస్లాపూర్ సభకు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సుదర్శన్, మాడావి శ్రీనివాస్, లక్ష్మణ్, దేవురావు, భీమ్‌రావు పాల్గొన్నారు.

సిరికొండ: ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ నాయకులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఆదివాసీలు, వేథావులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ మండలాధ్యక్షుడు కుమరం యాదవ్‌రావు, కొట్నాక్ పాండు, ఎంపీపీ పెందుర్ అమృత్‌రావు, సర్పంచ్‌లు పెందుర్ అనిల్, రఘురాం పాల్గొన్నారు.

సెలవు ప్రకటించాలి..

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ దినోత్సవం రోజు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు కలెక్టర్లు సెలవు ప్రకటించాలని రాజ్‌గోండ్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా జిల్లా మేడి మెస్రం దుర్గు, మంగం విషంరావు, ఆనంద్‌రావు, శ్రీరాం, శేషు, ఆత్రం నాగోరావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల నిరసన

గుడిహత్నూర్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల పంచాయతీ కార్మికులు సోమవారం ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. వీరు మాట్లాడుతూ.. గతనెల రోజుల నుంచి సమ్మె చేస్తున్నప్పటికీ పాలకులు, ప్రభుత్వం పట్టించుకోక పోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో కార్మికులు రమేశ్, వెంకటి, ఆశన్న పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ఇచ్చోడ: పంచాయతీ కార్మికులను రెగ్యులర్ చేయాలని పంచాయతీ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. అర్హత ఉన్న వారిఇన బిల్ కలెక్టర్, కారోబార్‌లుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. రాస్తారోకోలో నాయకులు కొలిపాక అశోక్, రాజేశ్వర్, యుసుఫ్, భూమారెడ్డి, సాహెబ్‌రావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

తాంసి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్ల జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ డిమాండ్ చేశారు. సోమవారం భీంపూర్ మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు మీరాబాయ్, సుజాత, కార్మికులు ఆశన్న, రాజు, సురేశ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

తలమడుగు: మహిళ చట్టాలపై అవగాహన ఉండాలని షీ టీం ఇన్‌చార్జి, ఏఎస్సై సునీత అన్నారు. మండలంలోని సుంకిడి గ్రామంలో జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందికి గురి చేస్తే వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, క్యూఆర్ కోడ్, ఫోక్స్ యాక్ట్, గురించి వివరించారు. కార్యక్రమంలో సత్యమోహన్, విజయ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

తాంసి: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపొద్దని భీంపూర్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని నిపాని వద్ద సిబ్బందితో కలిసి డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలు జరుగకుండా సహకరించాలని వాహనదారులకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది గోకుల్, షకీల్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

బజార్‌హత్నూర్: మండలంలోని కాండ్లీ గ్రామంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లి పాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖరావ్, అంగన్‌వాడీ కార్యకర్త సంగీత, గర్భిణులు పాల్గొన్నారు.

నార్నూర్: అమ్మపాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో మేలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్), వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులకు శ్రీమంతం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు వందన, ఉమాదేవి, సుభాష్‌రాథోడ్, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

సదాశివ మాస్టర్ వర్ధంతి

ఆదిలాబాద్‌రూరల్: సామల సదాశివ మాస్టర్ 11వ వర్ధంతిని సోమవారం జిల్లా కేంద్రంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ చౌక్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, కాముస్ విఠల్, సామల రజవర్ధన్, బొమ్మ కంటి రమేశ్, చిలుక విలాస్, బేత రమేశ్, బాస దత్తు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

ఇచ్చోడ: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి కుంటుపడిందని, వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం శివాజీచౌక్‌లో సుభాష్‌నగర్ కాలనీవాసులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. సుభాష్‌నగర్, విద్యానగర్ కాలనీ రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పంచాయతీకి ఆదాయం ఉన్నా.. పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. పోలీసులు నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ, రేణిగుంట సురేశ్, నంది లక్ష్మణ్, అబ్దుల్ అరీఫ్, వాజిద్ పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న సుభాష్‌నగర్ కాలనీ వాసులు

టీయూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఆదిలాబాద్‌లోని సంఘ కార్యాలయం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎన్నో పోరాటాలు చేసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జలందర్ రెడ్డి, భీంరావ్, రామారావ్, లచ్చారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వెంకట్ రావ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'ఎన్నికలెప్పుడొచ్చినా కాంగ్రెస్‌దే అధికారం'

కైలాస్‌నగర్: తెలంగాణలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని 12వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు భరత్ వాగ్మారే, శ్రీకాంత్ రెడ్డి, భూపెల్లి శ్రీధర్, రాహుల్, ఆనంద్ రావు పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వేయించాలి



రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారి

తాంసి: వ్యాధుల నివారణకు 16 ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా మాతాశిశు సంరక్షణ అధికారి విజయసారథి అన్నారు. సోమవారం భీంపూర్ మండలంలోని అర్లి(టి), ధనోర సబ్‌సెంటర్‌ల వద్ద చేపట్టిన మిషన్ ఇంద్రధనస్సు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. భీంపూర్ వైద్యాధికారి నిఖిల్‌రాజ్, హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ లూసి, హెల్త్‌అసిస్టెంట్ విష్ణు, ఏఎస్‌ఎంలు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సోషల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంబ్లే ప్రజ్ఞశీల్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంఈవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల భద్రత కోసం ఫైర్ సేఫ్టీ ఏర్పాటు చేయాలన్నారు. క్రీడా మైదానాలు లేని పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు రాథోడ్ కల్యాణ్, జుబేర్ ఖాన్, అబ్రార్ అహ్మద్, శశి, అభి పాల్గొన్నారు.

చర్చి నిర్మాణాన్ని నిలిపివేయాలి

తలమడుగు: మండలంలోని ఉండం శివారులో మత్తడివాగు ముంపు ప్రాంతంలో చర్చి పనులు నిలిపివేయాలని సోమవారం విశ్వహిందూ పరిషత్ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈప్రాంతంలో గతంలో ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడం జరిగిందన్నారు. మత్తడి వాగు ప్రాజెక్టు నిర్మాణం తరువాత బ్యాక్‌వాటర్ చేరి ముంపుకు గురైందన్నారు. కొందరు వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా చర్చి నిర్మిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో గంగాధర్, శారద, శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'డాడీస్ రోడ్' యాప్ ఎంతో ఉపయోగకరం

గుడిహత్నూర్: రోడ్డు ప్రమాద బాధితులతో పాటు అత్యవసర సర్వీస్ అందించేందుకు డాడీస్ రోడ్ అనే వాహన సురక్షిత యాప్ ఉపయోగపడుతుందని ఎస్సై ఇమ్రాన్ అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో యాప్ కరపత్రాలు ఆవిష్కరించారు. కేవలం రూ. 599లకు వాహన జీవిత కాలం వ్యాలిడిటీతో పొందవచ్చన్నారు. ప్రమాదం జరిగినా వెంటనే యాప్ నుంచి స్కాన్ చేస్తే వారి కుటుంబ సభ్యులకు సమాచారం వెళ్తుందన్నారు. కార్యక్రమంలో డాడీస్ రోడ్ జిల్లా కోఆర్డినేటర్ యనగంటి ప్రభాకర్, రాజు షిండే, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గన్నోజి శ్రీనివాస్, కొండ ప్రశాంత్, నాగుల సతీశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరిన నూతన విద్యార్థులకు కళాశాల గురించి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జలగం అనిత మాట్లాడుతూ.. విద్యార్థులకు డ్రెస్‌కోడ్, సౌకర్యాలు, వినియోగం, స్కాలర్‌షిప్, క్రమశిక్షణ అంశాల గురించి వివరించారు. అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనీస సామర్థ్యాలు పెంపొందించాలి



మాట్లాడుతున్న అధికారి నర్సయ్య

బేల: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అకడామిక్ మానిటరింగ్ అధికారి కంటె నర్సయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలిమెట్టు శిక్షణ శిబిరాన్ని సెక్టోరియల్ అధికారులు సుజత్‌ఖాన్, ఉదయ్‌శ్రీలతో కలిసి పరిశీలించారు. విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కోల నర్సిహులు, డీఆర్పీలు శివకుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

గద్దర్ మృతి ప్రజానీకానికి తీరని లోటు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నినాదాలు చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రజా యుద్ధనౌక గద్దర్ అకాల మరణం సాంస్కృతిక రంగంతో పాటు తెలంగాణ ప్రజానీకానికి తీరని లోటని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఆర్ఆర్ నివాసంలో గద్దర్ సంతాప సభ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. జిల్లాలో జరిగిన భట్టి విక్రమార్క పాదయాత్రలో తోడు ఉంటూ ప్రోత్సహించారని గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరన్నారు. కార్యక్రమంలో నాయకులు భరత్ వాగ్మారే, నగేశ్, ఆనంద్‌రావు, రాహుల్, చంద్రాల శ్రీధర్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతి తీరని లోటని దళితసంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద భీం ఆర్మీ ఆధ్వర్యంలో, కాంగ్రెస్ కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గం అధ్యక్షుడు పరత్‌వాగ్ దత్త, సోన్‌కాంబ్లే మనోహార్, ముఖడే ఉత్తం, జితెందర్, వెంకట్‌రావ్, మానిక్‌రావ్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఫస్ట్‌స్టెప్ పాఠశాలలో సోమవారం ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. పాఠశాల కరస్పాండెంట్ అనురాజ్ రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎదులాపురం: ప్రజా యుద్ధనౌక గద్దర్ మరణం దేశానికే తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో నళిని రెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఎస్‌ఆర్‌నగర్‌లో గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండల కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేతావత్ రాందాస్, ప్రజాసంఘాల నాయకులు పవార్ దేవిదాస్, మోహన్, దేవురావు, గణేశ్, రవీందర్, రవీందర్, రాహుల్, కాంగ్రెస్ నాయకులు ఖయ్యూం, బిరుదుల లాజర్, రాజేశ్వర్, రాధాబాయి, అన్నపూర్ణ, సులోచన, షేక సలీం పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలో ఆదివాసీ నాయకులు గద్దర్ చిత్రపటానికి సోమవారం నివాళులర్పించారు. కుంరం యాదవ్‌రావు పాల్గొన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మావల జెడ్పీటీసీ నల్ల వనిత అన్నారు. మావల మండలానికి నూతనంగా మంజూరైన 108 వాహనాన్ని సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్య, వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించేందుకు 108 వాహనాలు ఎంతోగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దొగ్గలి రాజేశ్వర్, అజీమ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి మహేందర్, 108 సిబ్బంది పాల్గొన్నారు.

108 వాహనం ప్రారంభం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండల కేంద్రానికి ప్రభుత్వం మంజూరైన చేసిన 108 వాహనాన్ని సోమవారం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ మహేందర్ ప్రారంభించారు. 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఈఎంటీ శైలాస్, రాజశేఖర్, దత్తత్రేయ, పైలెట్స్ ధరమ్‌సింగ్, నాందేవు, పాల్గొన్నారు.



108కు పూజ చేస్తున్న జెడ్పీటీసీ నల్ల వనిత

సిరికొండ: తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన 108 వాహనం సోమవారం మండలానికి చేరుకుంది. దీంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంబులెన్స్ కేటాయించడంతో మండలంలోని ప్రజలకు అత్యవసర సేవలు అందుతాయని అంబులెన్స్ సిబ్బంది పేర్కొన్నారు.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌రూరల్: బేల ఫీడర్ లైన్ 33కేవీ నిర్మాణ పనులు కొనసాగుతున్నందున మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్‌శాఖ అధికారి తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారుగూడ, పిప్పల్‌ధరి, అంకోలి, సాత్నాల సబ్ స్టేషన్ పరిధిలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: నేటి నుంచి పశువులకు మండల వ్యాప్తంగా ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని ముఖరా(బి)లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అడవ్ మారుతి, సిబ్బంది శివ, శ్రీను పాల్గొన్నారు.

నేటి నుంచి పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయం

బేల: ఇంటింటా జాతీయ జెండా ఎగురవేయాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు తపాలా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి జెండాలు విక్రయించాలని తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ సుజిత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పోస్టాఫీసులో జాతీయ జెండాలు అందుబాటులో ఉంటాయని, కేవలం రూ.25లకే లభిస్తుందన్నారు.

సంక్షిప్తం..

సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

ఆదిలాబాద్‌రూరల్: సీఎం కేసీఆర్ ఇటీవల రైతు రుణమాఫీ చేయడంతో సోమవారం మండలంలోని తంతోలి గ్రామంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు సెవ్వ జగదీష్, కుమ్ర రాజు. సర్పంచ్ లక్ష్మీ, పీఏసీఎస్ చైర్మన్ బుచ్చన్న, డీసీసీబీ డైరెక్టర్ మల్లేశ్, నాయకులు రాజేశ్వర్, ఆశరెడ్డి, లింగారెడ్డి, సాంబయ్య, శివయ్య పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం

బోథ్: మండల కేంద్రంలోని శివభక్త మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం నాయకులు జాతీయ చేనేత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరారు. అనంతరం డివిజన్ దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సదాశివ్, పట్టణ అధ్యక్షుడు భోజన్న పాల్గొన్నారు.

యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా రమేశ్

బోథ్: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా సొనాల గ్రామానికి చెందిన రమేశ్ బత్తులను నియమితులయ్యారు. సోమవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివ రాథోడ్ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చరణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం మహిళా సాధికారికతపై అవగాహన కల్పించారు. మహిళాభివృద్ధి, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు. ఉద్యోగులు యశోద, కృష్ణవేణి, కోటేశ్వర్, నిఖిలేశ్వర్ రెడ్డి, నాగమణి, సుకేషణ, కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ, రాజ్‌కుమార్, వీరస్వామి, రాజన్న, సుధాకర్, రామేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా గ్రామాల్లో చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న డివిజన్ ఉద్యమం

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా చేయాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న దీక్షలు సోమవారానికి 22వ రోజుకు చేరుకుంది. దీక్షలో కుచులాపూర్ గ్రామస్తులు కూర్చున్నారు. వీరికి పద్మశాలి సంఘం సభ్యులు, నాయకులు మద్దతు తెలిపారు.

నష్ట పరిహారం చెల్లించాలి

నేరడిగొండ: దెబ్బతిన్న పంటలకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాబ్లే సంతోష్‌సింగ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్, జాదవ్ పరశురాం, తోడసం శంకర్, తమ్మల ఉదయ్, నవీన్, గట్టు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

గుడిహత్నూర్: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కవిత రెడ్డిని సోమవారం మండల బీఆర్‌ఎస్ నాయకులు, సర్పంచ్ జాదవ్ సునీత ఘనంగా సన్మానించారు. కరాడ్ బ్రహ్మానంద్, ఫడ్ దిలీప్, సంగ ఆశన్న యాదవ్, మాధవ్ కేంద్రే పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899